ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్‌ను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌస్‌పల్లి సర్పంచ్, ఉపసర్పంచ్




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 172 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 18 జూన్ 2026

# హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

## భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం

హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం

ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ

మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య




**ప్యారిస్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):**హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, మిగతా2లో...

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

## ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం

● ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది ● సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు ● అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు ● కులమతాలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం ● ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్

స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్



**రంగారెడ్డి,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ మిగతా2లో...



# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు

అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్

సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం.

మిగతా2లో...

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

- రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం
- రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**కరీంనగర్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

మిగతా2లో...

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

● అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ ● వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం ● భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో

మిగతా2లో...

# రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి
- పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి
- సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు
- కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, మిగతా2లో...



# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

## కేంద్రం తీరుపై మండిపడ్డ రాహుల్, కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):**నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వివాదాన్ని రేకెత్తించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా విమర్శించారు. 'ఈ చర్య నిజంగా పేపర్ లీక్‌లను నిరోధిస్తుందా' అని వారు సందేహాలు వ్యక్తం చేశారు.

మిగతా2లో...

# రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే...

● దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది ● జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా... ● ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం ● సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే ● పాలేరు నియోజకవర్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్



**ఖమ్మం,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది మిగతా2లో...



# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

- 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ఇళు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై

మిగతా2లో...

# సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

బెంగాల్, బీహార్‌లే ఇందుకు నిదర్శనం

మీడియాతో మంత్రి అజారుద్దీన్ వ్యాఖ్య



**హైదరాబాద్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** 'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లను తొలగించే అవకాశముందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'సర్' అందరి అంశమైనా.. ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్, బిహార్‌లో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మిగతా2లో...

PCW తెలుగు దినపత్రిక

గురువారం 18 జూన్ 2026

# హర్మ్యూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

(మొదటి పేజీ తరువాయి)

వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మ్యూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోడీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం,



ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు.

# రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్‌ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు..అంతా సంక్షోభమే...

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్‌ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు.

# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశం లో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఔఅఖీః) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షా పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు 'పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టెలిగ్రామ్‌ను నిషేధించారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దొంగలను పట్టుకోలేక, బాధితుల తలుపులకు తాళం వేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌ను ఉపయోగిం చుకుని నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, డిస్కషన్‌లతో చదువుకుంటున్నారు. ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుంది' అని సోషల్ మీడియా ద్వారా రాహుల్ విమర్శించారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. 'ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా?' అంటూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిషేధాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షించడమే. ఈ చర్య అసలు లీక్‌లను ఆపదు' అని వ్యాఖ్యానించారు.

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు.ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోనూ అలాంటి కుట్రలకు పాల్పడే ఛాన్స్ ఉందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి అజారుద్దీన్ మాట్లాడారు. 'సర్' అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరి ఓటుని వాళ్లే కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. 'సర్'లో తొలగించే ఓట్లతో గెలుపు, ఓటములు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మాట్లాడినా.. నిజాయితీగా మాట్లాడుతానని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. తనకు తెలుగు రాయడం, చదవడం వచ్చు అని వివరించారు. తెలుగులో మాట్లాడటం మాత్రం కొంత ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. చిన్నప్పుడు తెలుగులో రాయడం, చదవడం ప్రాక్టీస్ చేసేవాడినని తెలిపారు. తెలుగులో మాట్లాడితే తప్పులు పోతే కొంత ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. తనకు సులువుగా ఉండే భాషలోనే తాను మాట్లాడుతానని అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరపు విమర్శలు చేస్తూనే ఉంటాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అద్భుతమైన పాలన అందిస్తున్నామని వ్యాఖ్యానించారు. విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని మంత్రి ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని తమ ప్రభుత్వం చెల్లిస్తోందని స్పష్టం చేశారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చాలామంది పేదలకు సాయపడ్డానని.. పలు సమస్యలు పరిష్కరించానని తెలిపారు. తనకు పబ్లిసిటీపై మోజు లేదని అన్నారు. 200 మందికి పైగా ఆయా సమస్యలు పరిష్కరించాలని తనకు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించానని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు.

# సిఎం రేవంత్‌తో ఈషాసింగ్ భేటీ



**హైదరాబాద్,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఈషా సింగ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల జరిగిన ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషా సింగ్ ని సిఎం రేవంత్ అభినందించి, సత్కరించారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌస్‌పల్లి సర్పంచ్, ఉపసర్పంచ్








**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామ సర్పంచ్ పసుల కార్తీక్, ఉపసర్పంచ్ చింతనిప్పుల రఘు బీఆర్ఎస్ పార్టీని వీడి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని మంత్రి సీతక్క క్యాంప్ కార్యాలయంలో ఆమె స్వయంగా కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతో పలువురు నాయకులు పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సర్పంచ్ పసుల కార్తీక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, రైతు సంక్షేమం, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆకర్షించాయని చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామాభివృద్ధి ధ్యేయంతోనే పార్టీ మారినట్లు స్పష్టం చేశారు. ఉపసర్పంచ్ చింతనిప్పుల రఘు మాట్లాడుతూ మంత్రి సీతక్క నాయకత్వంపై నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గోరంట్ల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశం కోసం ప్రాణ త్యాగం చేసి,దేశ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మా గ్రామం నుంచి కాంగ్రెస్‌లో సర్పంచ్ ఉప సర్పంచ్ తదితరులు చేరారని వారికి అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం గ్రామంలోని పలువురు నాయకులు సైతం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వారికి అపూర్వ స్వాగతం పలుకుతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం కలిసివచ్చే నాయకులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఆయన తెలిపారు.మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు మేకల ప్రశాంత్, నాగరాజు, ముంజాల కుమారస్వామి, ఉప్పు మొగిలి, కనకం రవి, గోల్కొండ సురేష్, పసుల చిరంజీవి, మార్త తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్‌ను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**తొర్రూరు ప్రతినిధి, జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలోని డాక్టర్ శ్రీనివాస్ ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసి పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి డాక్టర్ శ్రీనివాస్ గ్రామీణ మరియు పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణుల వైద్య సేవలు పొందగలరని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆసుపత్రి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, సీనియర్ నాయకులు డా, సోమేశ్వర్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యులు, సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

# గాడిదల వాగు గుడిపాడు తామర చెరువు తీవ్ర కాలుష్యం



- కుళ్లిన కోడి వ్యర్థాలతో దుర్వాసన
- చనిపోతున్న చేపలు ఆందోళనలో స్థానికులు
- రోగాలు వ్యాపిస్తాయనే భయంతో వణికిపోతున్న ప్రజలు
- కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలని అధికారులకు విజ్ఞప్తి



**సత్తుపల్లి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సత్తుపల్లి పట్టణంలోని కాకరపల్లి రోడ్డులో ఉన్న గాడిదల వాగు గుడిపాడు తామర చెరువు తీవ్ర కాలుష్యానికి గురవుతోంది. వాగులో పెద్దఎత్తున కుళ్లిపోయిన కోడి వ్యర్థాలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను అక్రమంగా పడేయడంతో పరిసర ప్రాంతాల్లో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వాగులో చేరుతున్న వ్యర్థాలు సమీపంలోని చెరువులు, నీటి వనరులను కూడా కలుషితం చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోడి వ్యర్థాలు కుళ్లిపోవడంతో నీటిలో విషపూరిత పరిస్థితులు ఏర్పడి చేపలు పెద్ద సంఖ్యలో మృతి చెందుతున్నాయని పేర్కొంటున్నారు. చెరువులో తేలియాడుతున్న మృత చేపలు కాలుష్య తీవ్రతకు అద్దం పడుతున్నాయని అంటున్నారు. ప్రతి ఉదయం వాకింగ్‌కు వచ్చే ప్రజలు, సమీప కాలనీల నివాసితులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ కాలుష్యం కారణంగా దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. గాడిదల వాగులో చెత్త, కోడి వ్యర్థాలు, ప్లాస్టిక్ పదార్థాలు వేయకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాగును పూర్తిస్థాయిలో శుభ్రపరచి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంబంధిత శాఖలు అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజా సంక్షేమ వేదిక పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రి సీతక్క




**ములుగు, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముద్రించిన పోస్టర్లను తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదని, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించి సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ వేదిక సామాజిక సేవా సంస్థ బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతి, ములుగు చైర్‌పర్సన్ చంద్రకళ, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంక్షేమ వేదిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# తాత పేరుతో మనవడు పాఠశాలకు బహుమతి అందజేత




**తొర్రూరు ప్రతినిధి, జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** సొంత గ్రామాన్ని చదువుకున్న పాఠశాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారు ప్రతి ఒక్కరు.. మనం విద్య నేర్చుకున్న పాఠశాల స్వగ్రామంలో ఉన్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా బహుమతి రూపకంగా పాఠశాలకు ఇచ్చిన విద్యార్థులకు ఇచ్చిన ఆ పేరు మాత్రం ఆ గ్రామంలో చిరస్థాయిగా నిలుస్తుంది. గ్రామంలో ఉన్న ఎవరైనా సరే పాఠశాలకు ఎంత బహుమతి ఇచ్చిన తక్కువే అంటున్నారు పరిశీలకులు?. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామ పంచాయతీలోని పాఠశాలకు నూతనంగా ఎన్నికైన సర్పంచి తోపాటు వార్డు సభ్యులు పాఠశాల అభివృద్ధికై కొందరు ఎనలేని కృషి చేశారు అనటానికి నిదర్శనాలు ఎన్నో గతంలోని గ్రామ సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పేర్లతో పాటు వారు చేసిన అభివృద్ధిని కూడా గుర్తు చేశారు. గ్రామంలో ఎవరైనా సరే శుభకార్యాలు పుట్టినరోజు వేడుకలు ఇలాంటి సందర్భాలు ఉన్నప్పుడు పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో పాలుపంచుకుంటే వారి ఆనందమే వేరని అలాంటి కార్యక్రమాలు పాఠశాలలో జరుపుకోవాలని ప్రధానోపాధ్యాయులు గతంలోనే తెలిపారు. అదే తరహాలలో బోయిని ప్రశాంత్ గుర్తూరు ఉన్నత పాఠశాలకు తాత బోయిని అచ్చయ్య జ్ఞాపకార్థం సీలింగ్ ఫ్యాన్‌ను బహుమతిగా అందించారు. ఎంఈఓ బుచ్చయ్య , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎన్.వి సత్యనారాయణ కి విద్యార్థుల సౌకర్యార్థం సీలింగ్ ఫ్యాన్ ను బహుకరించడం జరిగింది.ఎంఈఓ బుచ్చయ్య ప్రసంగిస్తూ విద్యార్థులకు ,పాఠశాలకు బహుమతులను అందించటం అది గ్రామంలో ఉన్నవారు ఇలాంటి బహుమతి అందించి వారి పేరును నిలబెట్టుకోవడం ఎంతో ఆనందకరమైన విషయం అని అన్నారు.పాఠశాల విద్యార్థుల తరపున,ఉపాధ్యాయ బృందం తరపున బహుమతి అందజేసిన వారికి అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

## భక్తాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ నలుమాచు మనోహర్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిబిరం



**చొప్పదండి జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం చొప్పదండి మండలంలో ఈరోజు రాగంపేట గ్రామంలో శ్రీ భక్తఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నలుమాచు మనోహర్ ఆధ్వర్యంలో గ్రామంలోని నిరుద్యోగ యువతకు కుట్టు మిషన్ నేర్చుకొనున్న మహిళలకి మంచి సదావకాశం కల్పించారు. 2నెలలుగా కుట్టు మిషన్ ట్రైనింగ్ పూర్తి చేసిన మొదటి బ్యాచ్ 10మంది గ్రామ మహిళలకి సర్టిఫికెట్ లు అందజేయడం జరిగింది.మనోహర్ మాట్లాడుతూ..తదుపరి 2వ బ్యాచ్ ప్రారంభిస్తున్నాము . ఈ అవకాశంతో గ్రామ యువతకు లబ్ది చేకూరాలని కోరుతూ..సేవభావం అందరిలోని ఉండాలని భావించారు. మనోహర్ సార్ దంపతులకు డా,,మల్లేశం చాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ మామిడి రాజేశం, గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్ ,సింగల్ విండో డైరెక్టర్ గజ్జెల శంకర్, బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎలిగేటి మల్లేశం, డీలర్&మాజీ సర్పంచ్ బసరవేణి లక్ష్మిరాజాం, మాజీ టిఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి కరీం, వార్డు సభ్యులు దీకొండ ప్రభాకర్, దీకొండ రమేష్,గోపు రమ జితేందర్ రెడ్డి, కుక్కల తిరుపతి,అంగన్వాడీ టీచర్ బొడ్ల సరోజన,కుట్టు మిషన్ ట్రైనర్ తమ్మనవేణి కవిత, మరియు తమ్మనవేణి శ్రీనివాస్,రాచకొండ సంతోష్,ఎలిగేటి కనకయ్య, శ్రీనివాస్,సింగసాని రామకృష్ణ, రవి సంతోష్, ఎండి అమానుల్ల,రాచకొండ లచ్చయ్య,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ: మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్






**కల్లూరు, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ దారావత్ మోహన్ అన్నారు. బుధవారం కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు, అలాగే 15వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువును కొనసాగించేందుకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదువుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పొంగులేటి యూత్ నాయకుడు యాసా శ్రీకాంత్, హెచ్ఎం పొదిల పద్మ, ప్రధానోపాధ్యాయులు వరక రామారావు, మామిడాల వెంకటేశ్వరరావు, అనిత కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



**పెనుబల్లి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండలంలో ముత్తగూడెం వద్ద క్రాంతి ట్రాన్స్ పోర్టు లారీ డ్రైవర్ గుండె పోటు కు గురై లారీ క్యాబిన్ లోనే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట లోని గణేష్ నగర్ కు చెందిన ఎస్. ఎల్లయ్య (65) అనే వ్యక్తి కాంతి ట్రాన్స్ పోర్టు లారీ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఎండలు తీవ్రంగా ఉండటంతో అలిసిపోయిన డ్రైవర్ ఎల్లయ్య ముత్తగూడెం వద్ద లారీ పక్కకు పార్కింగ్ చేసి లారీ క్యాబిన్ లోనే పడుకున్నాడు. కొన్ని గంటలు గడిచిన కూడా లారీ పార్కింగ్ చేసిన స్థలం నుంచి తియ్యకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించగా అప్పటికే లారీ డ్రైవర్ ఎల్లయ్య నిద్రలోనే గుండె పోటు కు గురై మృతి చెందినట్లు గుర్తించారు.

# ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో సిల్ట్ తొలగింపు పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్ జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం 22, 33, 41 మరియు 50వ డివిజన్లలో నిర్వహిస్తున్న మురుగు కాలువల సిల్ట్ తొలగింపు పనులను మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తొలగించి, వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల శుభ్రపరిచే పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, అందరూ పరిశుభ్రతకు సహకరించాలని మేయర్ కోరారు. నగర అభివృద్ధి, పరిశుభ్రత కోసం ప్రభుత్వం మరియు నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, నాంపల్లి రేణుక శ్రీనివాస్, హీనా ఆఫ్రిన్, ఏపీపీ చంద్ర, కో–ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

# గుర్తూరు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ వి .కవిత బాలకృష్ణ.
### - పాఠశాల ప్రత్యేక బఆహ్వానితులుగా ఎంఈఓ బుచ్చయ్య హాజరు







**తొర్రూరు ప్రతినిధి, జూన్ 17(పీసిడబ్ల్యూ న్యూస్):** విద్యాభ్యాసం అనేది పాఠశాలలు తెరవక ముందే విద్యార్థులు తల్లిదండ్రులు గతంలో బాసరలోని సరస్వతి దేవాలయంలో పూజలు నిర్వహించి అక్షరాభ్యాసం చేయించుకొని వచ్చేవారు. ప్రస్తుతం వేసవికాలంలో తీవ్ర ఎండలను వేడిని దృష్టిలో పెట్టుకొని చాలామంది వెళ్లలేక పాఠశాల ప్రారంభంలోని స్వగ్రామమైన దేవాలయం లాంటి పాఠశాలలోనే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలోని ఏర్పాటు చేశారు. ఈ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్ విద్యార్థినీ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనపరిచి ఆ అనే అక్షరం నుండి మొదలుపెట్టి వారికి మంచి విద్యను అందించే అందుకు కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాల అంటే విద్య ఎలా ఉంటుందో తెలియపరుస్తూ ఆ విద్యార్థిని విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్లే విధంగా ఉండాలని వారి కోరిక ఎంతగానో ఉంది వారు చేసే కృషి పాఠశాలకు పడుతున్న శ్రమ ఎవరు మర్చిపోలేని విధంగా మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణను ఆహ్వానించారు. వీరితోపాటు మండల విద్యాధికారి బుచ్చయ్యను కూడా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ హాజరైన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారిని ఆశీర్వదించారు. వీరితోపాటు మండల విద్యాశాఖ అధికారి బుచ్చయ్య పాల్గొని విద్య యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి పాఠశాలకు హాజరైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈఓ ప్రసంగిస్తూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పోటీపడుతున్నాయని ఈ సంవత్సరం ప్రభుత్వం కూడా పాఠశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసి వారిని మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షతో ఉపాధ్యాయులను కూడా మంచి విద్యను అందించే వారిని నియమించారని గుర్తు చేశారు. శ్రమ అనుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రులు మీకు ఎన్ని అవసరాలు ఉన్న మీ పిల్లలను శ్రద్ధగా పాఠశాలకు పంపించాలని శుభకార్యాల పేరుతో వారి విద్యకు ఆటంకం కలగకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి వార్డు సభ్యులు ,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాఠశాల ప్రారంభంలోనే ఇలాంటి కార్యక్రమం జరగటం విద్యాశాఖ అధికారుల సమక్షంలో ఎంతో ఉత్సాహ భరిత వాతావరణంలో నెలకొల్పటం చాలా ఆనందమని ఇంతటి శ్రద్ధ తీసుకున్న ప్రధానోపాధ్యాయులకు ,విద్యా అధికారులకు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు శుభాకాంక్షలు అందజేశారు. మీ నోటి మాట ప్రకారం పాఠశాలలో చదువుతున్న మా పిల్లలు ఉన్నత స్థాయికి ఎదుగుతారు అనే నమ్మకం మాకు కూడా కలుగుతుందని తల్లిదండ్రులు అనడం విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. తిరుమలేష్ గారు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించి వారి విద్యాభ్యాసం విజయవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు మరియు విద్యాశాఖ అధికారుల సమక్షంలో ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# భారీ వర్షాలతో కల్లూరు అతలాకుతలం

### సేవాభావంతో ముందుకొచ్చిన యువత
### హైవేపై కూలిన చెట్ల తొలగింపు..
### ట్రాఫిక్‌కు మార్గం సుగమం
### కప్పలబంధం కాలువ వద్ద విరిగిన విద్యుత్ స్తంభం.. చుంద్రుపట్ల రోడ్డుపై నేలకొరిగిన చెట్టు
### హైవే పక్కన నిలిచిన వర్షపు నీరు డ్రైనేజీ పూడిక తొలగించాలని ప్రజల విజ్ఞప్తి




**కల్లూరు, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షాలు పలు ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపాయి. బలమైన గాలులు, వర్షం కారణంగా ఖాన్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని హైవేపై పలు చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే పరిస్థితి తీవ్రతను గుర్తించిన గ్రామ యువకులు వెంటనే స్పందించి చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వారి సేవాభావం, సమాజంపై ఉన్న బాధ్యతాభావం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. ఇదే సమయంలో కప్పలబంధం కాలువ సమీపంలో విద్యుత్ స్తంభం విరిగిపడగా, చుంద్రుపట్ల రోడ్డులోని ప్రతిభా స్కూల్ సమీపంలో పెద్ద చెట్టు నేలకొరిగింది. అలాగే కళ్యాణపు పెద్ద వెంకటేశ్వరరావు ఇంటి వద్ద భారీ చింతచెట్టు కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఖాన్‌ఖాన్‌పేట హైవే పక్కన వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది వెంటనే జేసీబీ సహాయంతో డ్రైనేజీ పూడిక తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం చిన్న వర్షానికే నీరు నిలిచిపోతుండగా, మరింత భారీ వర్షాలు కురిస్తే నీరు ఇళ్లలోకి చేరే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా స్పందించి చెట్ల తొలగింపు, ప్రజల భద్రత, ట్రాఫిక్ పునరుద్ధరణలో సహకరించిన గ్రామ యువత, స్థానికులు, అధికారులు, సిబ్బందికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే స్ఫూర్తితో సంబంధిత శాఖలు ముందుకు రావాలని కోరారు.

# సోలార్ ప్లాంట్ పెట్టండి...లాభాలు ఆర్జించండి.

**- ఏటా రూ.50 లక్షలు ఆర్జించే అవకాశం.**







**కరీంనగర్ జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో నాబార్డు ద్వారా రుణం పొందండి. సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 1 శాతం వడ్డీకే రుణాలు.సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు.వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడి.జన ఔషధి కేంద్రాలను వినియోగించుకోవాలని పిలుపు.సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. ఈరోజు చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం చొప్పదండి శివారులో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయిన ఖర్చు, రుణం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలోని ముఖ్యాంశాలు.పీఎం కుసుం పథకంలో భాగంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికిపైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండిలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ధ్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి.వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది. అంటే ఒక శాతానికే లోన్ వచ్చినట్లవుతుంది. సోలార్ ప్లాంట్ ద్వారా ఒక్కో సహకార సంఘానికి ఏటా 50 లక్షల ఆదాయం సంపాదించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 5 సోలార్ ప్లాంట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. అందులో కరీంనగర్ లోని చొప్పదండిలో ఏర్పాటైంది కాగా మిగిలినవి పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటయ్యియి. రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని ఆదాయం సమకూర్చుకోవాలి. కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుంది. ఒకవేళ ఎవరైనా వ్యక్తిగతంగా పెట్టుకుంటే 9 శాతం వడ్డీతో రుణం లభిస్తుది. సక్రమంగా కడితే 3 శాతం మినహాయాంపు ఉంటుంది. సోలార్ ప్లాంట్ పెట్టుకోవాలంటే 3 ఎకరాల స్థలం అవసరం. తద్వారా 1 మెగావాట్ కరెంట్ ఉత్పత్తి అవుతుంది. ఏటా పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంది. భూమి లభ్యత కలిగిన వారు వెంటనే సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, మండల అధ్యక్షులు మొగిలి మహేష్, కౌన్సిలర్లు రాజన్నల రాజు ,జిట్ట మంగ కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్లు గొల్ల గట్టయ్య , గుండేటి శివశంకర్ మండల ప్రధాన కార్యదర్శిలు కొమ్ము రమేష్, ఎడ్ల సురేష్, చల్ల అనుష్ మాజీ సర్పంచ్ గుంట రవి, మాజీ ఎంపిటిసి తోట కోటేష్, చిట్యాల పల్లి ఉపసర్పంచ్ బాలు, మాజీ సర్పంచ్ రఫిక్ మొహమ్మద్ ,యువ మోర్చా మండల అధ్యక్షులు పెద్ది వీరేశం గంగు సంపత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఏనుగు దామోదర్ రెడ్డి, కళ్లెం మనీష్ రెడ్డి ,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మడిపల్లి రాజు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు తిరుపతి, మాజీ అసెంబ్లీ కన్వీనర్ మొగిలి సారయ్య మాజీ మండలం అధ్యక్షులు సింగిరెడ్డి భూమిరెడ్డి, బత్తిని ప్రశాంత్, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, గుర్రం సమరసింహారెడ్డి, విలాసాగరం అంజయ్య జక్కుల శంకర్, దొంతి సారపు సంపత్, గాండ్ల సతీష్ అంజయ్య, రాపల్లి శ్రీనివాస్, దుశాంత్ రెడ్డి, అనుకారి సాయి కృష్ణ, గుండె వెంకటేష్, సింగసాని రాములు, గస్కంటి రవిసాదుల రమేష్ దయ్యాల శేఖర్ , వెంకటరమణ గాండ్ల వేణుతదితరులు పాల్గొన్నారు.

---

## సీతారాంపురంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల,జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని సీతారాంపురంలో శ్రీ లక్ష్మీ భూలక్ష్మీ సహిత నాగశిరల (బోడ్రాయి), పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ, గ్రామదేవతా సహిత నాగేంద్ర, నవగ్రహ మూలతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాల్లో దేవాలయాలు, గ్రామదేవతల ఆలయాలు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవతలను ప్రార్థించినట్లు తెలిపారు. సీతారాంపురం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ మహోత్సవం విజయవంతం కావడం ఆనందదాయకమని అన్నారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి,శాలువాతో సన్మానించారు.

## “బడిబాట మనబడి, మన బాధ్యత“ కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ





**కరీంనగర్ టౌన్ జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు నిర్వహిస్తున్న “బడిబాట మనబడి, మన బాధ్యత“లి కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఉచిత పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాల్లో ముందంజలో నిలవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.అలాగే గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణను అలవరచుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని మేయర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణ, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

## ఎనిమిది రోజులుగా తెరిచి ఉన్న కల్వర్టు

**ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న శాంతినగర్ మార్గం**

**తక్షణమే పైపులు ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి**





**కల్లూరు, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ 18వ వార్డు, 5వ వార్డు మధ్య ఉన్న కల్వర్టును ఎనిమిది రోజుల క్రితం మున్సిపాలిటీ సిబ్బంది పనుల నిమిత్తం తెరిచారు. అయితే ఇప్పటివరకు కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా, పైపులు ఏర్పాటు చేయకుండా, హెచ్చరిక బోర్డులు లేదా రక్షణ కంచెలు లేకుండా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లే పాదచారులు ప్రమాదవశాత్తూ గోతిని గుర్తించలేక జారి పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది గాయపడినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఈ మార్గంలో ప్రయాణించడానికి భయాందోళనకు గురవుతున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించి, అవసరమైన పైపులు ఏర్పాటు చేసి, భద్రతా చర్యలు చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శాంతినగర్ ప్రజలు కోరుతున్నారు. మరింత ఆలస్యం జరిగితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు వెంటనే చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

---

## హరీష్ రావు వ్యాఖ్యలపై సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్..

**కరీంనగర్, టౌన్ జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాపాలనను సమర్థవంతంగా కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులను విమర్శించడం సరికాదని ఆయన అన్నారు. హరీష్ రావు వైఖరి “దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా“ ఉందని వ్యాఖ్యానించిన నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచాలనే ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం పలు నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. కష్టపడి ప్రజల మద్దతుతో ఎదిగిన కాంగ్రెస్ మంత్రులపై బీఆర్ఎస్ నాయకులు అక్కసు వెళ్లగక్కడం మానుకోవాలని హితవు పలికారు. అలాగే ఎమ్మెల్సీ పుట్ట మధు కూడా బాధ్యతాయుతంగా మాట్లాడాలని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలు చేయడం వల్ల బీఆర్ఎస్ మరింత ప్రజాదరణ కోల్పోతుందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.



---

## హెచ్ఓడి క్రియేషన్స్ నూతన ఆఫీసు ప్రారంభం

**హెచ్ఓడి ప్రోప్రైటర్,బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్,ఆర్కిటెక్ మణిదీప్**



**హనుమకొండ, జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** నూతనంగా నిర్మించుకునే ఇండ్లకు సంబంధించిన ప్లాన్, ఇంటీరియర్, మోడ్రన్ వెలివేషన్ పనులకు సంబంధించిన హెచ్ఓడి క్రియేషన్స్ ను హెచ్ఓడి ప్రోప్రైటర్ మణిదీప్ తెలిపారు.హెచ్ఓడి క్రియేషన్స్ ను బుధవారం హనుమకొండ 100 ఫీట్ రోడ్డు లో ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి ఇంటిరియర్ కు సంబంధించి 100 ప్లస్ హౌస్ కి సంబంధించి 50 ప్లస్ పలు నగరాలైన హైదరాబాద్, వరంగల్ ట్రైసిటీ, భూపాలపల్లి, పరకాల, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతంలో హైపర్ ఇంటీరియర్, డోర్స్, షో బోర్డ్స్ వాళ్ళ మొదలైన ఇంటి పరికరాలకు సంబంధించినవి కస్టమర్లకు మన్నికతో తక్కువ రేట్లతో చేస్తున్నామని, కావున తమ నూతన హెచ్వోడి క్రియేషన్స్ ఆఫీసును నూతన గృహ నిర్మాణం చేపట్టే కస్టమర్లు వినియోగించుకోవాలని తక్కువ రేట్లు, ఎక్కువ మన్నికైన వస్తువులను ఉపయోగిస్తామని, అలాగే కస్టమర్లకు నచ్చిన విధంగా ఇంటి నిర్మాణ ప్లాన్లను ఇంటీరియర్ డిజైన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. రాజ్, కరుణ పాల్గొన్నారు.

# అయ్యప్ప సేవలో తరించడమే మా జన్మధన్యం

### - ఖమ్మం జిల్లా నూతన కమిటీ ప్రమాణం



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భక్తి కేవలం పూజలకే పరిమితం కాదని, అది తోటి జీవులకు చేసే సేవలో ప్రతిబింబించాలని చాటి చెబుతూ ఖమ్మం జిల్లాలో అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నూతన కార్యవర్గం కొలువుదీరింది. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాంద్ర రామ ప్రసాద్ గురుస్వామి దివ్య సమక్షంలో బుధవారం నాడు ఖమ్మం జిల్లా నూతన కమిటీని అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రకటించారు. స్వామి కార్యం కోసం, భక్తుల సౌకర్యార్థం అహర్నిశలు శ్రమించేలా నిబద్ధత గల సేవకులను నూతన బాధ్యతల్లో నియమించారు. జిల్లా అధ్యక్షుడుగా అన్నారపు నాగ రామాచారి, ఉపాధ్యక్షుడుగా ఊర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బజ్జూరి రమణారెడ్డి, ప్రచార కార్యదర్శిగా శీలం గోపాల్ రెడ్డి ల నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. **బాధ్యత కాదు... ఇది అయ్యప్ప ఇచ్చిన భిక్ష!** ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు అన్నారపు నాగ రామాచారి, ఉపాధ్యక్షుడు ఊర్ల వెంకటేశ్వర్లు భావోద్వేగంతో మాట్లాడారు. ఈ పదవులను తాము కేవలం హోదాలుగా భావించడం లేదని, ఆ మణికంఠుడు తమపై ఉంచిన గురుతర బాధ్యతగా, మానవత్వానికి సేవ చేసేందుకు లభించిన పరమ పవిత్రమైన అవకాశంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. "కనిపించే జీవుల కన్నీళ్లు తుడవడమే కానరాని ఆ పరమాత్ముని అసలైన సేవ" అని నమ్ముతూ, శరణు ఘోషతో పాటు సమాజ శ్రేయస్సు కోసం, అయ్యప్ప భక్తుల అభ్యున్నతి కోసం తమ శ్వాస ఉన్నంతవరకు అంకితభావంతో పనిచేస్తామని హృదయపూర్వకంగా ప్రతిజ్ఞ చేశారు. నూతన కమిటీ సభ్యుల మాటల్లోని నిబద్ధత అక్కడికి విచ్చేసిన వారి హృదయాలను హత్తుకుంది. ఈ పవిత్ర మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజర్ పగడాల కిషోర్, మాజీ జిల్లా అధ్యక్షుడు అల్లిక రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహారావు లు పాల్గొని నూతన కమిటీకి దిశానిర్దేశం చేశారు. గతంలో అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ, రాబోయే రోజుల్లో సమితిని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష పట్టణ అధ్యక్షుడు బందు అరుణ్, ప్రముఖ సభ్యులు హరికిషన్, నగిశెట్టి మహేష్‌లతో పాటు ఎందరో గురుస్వాములు, హరిహర సుతుని భక్తులు సమిష్టిగా పాల్గొన్నారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే నామస్మరణతో సభా ప్రాంగణమంతా భక్తిభావంతో రసార్ద్రమైంది. ఒకరికొకరు తోడుగా నిలుస్తూ, సమాజంలో ప్రేమను, సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ నూతన కమిటీ ప్రయాణం సాగాలని అందరూ ఆశీర్వదించారు.

# నిత్యం పవర్ కట్స్‌తో అంధకారంలో ప్రజలు..

- కల్లూరు విద్యుత్ సరఫరాపై తీవ్ర అసంతృప్తి
- శాంతినగర్, శ్రీరాంపురం, పుల్లయ్య బంజర రోడ్ ప్రాంతాల్లో రోజుకు పలుమార్లు విద్యుత్ అంతరాయం శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు

**కల్లూరు, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ 18, 19 వార్డులతో పాటు శ్రీరాంపురం, పుల్లయ్య బంజర రోడ్ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్లూరు లో చిన్న గాలి దుమ్ములకు, వర్షం కురిస్తే చాలు తరచూ విద్యుత్ కోతల కారణంగా గంటల తరబడి ప్రజలు కటిక చీకట్లో కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికుల కథనం ప్రకారం, శ్రీరాంపురంలో గత అనేక సంవత్సరాలుగా రోజుకు కనీసం రెండు సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అలాగే పుల్లయ్య బంజర రోడ్ ప్రాంతంలో పగలు రెండు సార్లు, రాత్రి రెండు సార్లు కలిపి రోజుకు నాలుగు సార్లు విద్యుత్ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్లో చెట్లు కొమ్మలు విరిగిపడడం వల్ల కరెంటు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంటున్నారు. ముఖ్యంగా శనివారం, ఆదివారం రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని అంటున్నారు. విద్యుత్ సమస్యపై సంబంధిత కార్యాలయానికి ఫోన్ చేస్తే సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ అంతరాయాలతో విద్యార్థుల చదువులు, వ్యాపార కార్యకలాపాలు, వృద్ధులు, చిన్నారుల దైనందిన జీవనం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్తుకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిరంతర విద్యుత్ సరఫరా అందించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కల్లూరు ప్రజలు కోరుతున్నారు.

# వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజీ నుండి కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వరకు...

## ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

### విద్యార్థులతో ముచ్చటించిన మంత్రులు..

### స్కూల్ ,కాలేజీల సమయానికి అదనంగా బస్సులు నడుపుతున్నారని తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్..









**కరీంనగర్ టౌన్ జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహా లక్ష్మీ తరువాత పెరిగిన ప్రయాణికుల రద్దీ దృశ్య కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు.. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ బస్సులకు ఉచిత ప్రయాణమే కాదు.. ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిందని తెలిపారు.ప్రయాణికులతో ప్రేమ పూర్వకంగా మాట్లాడాలని ,వారి అసౌకర్యం కలిగించవద్దని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తున్నామని కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయిందని ఎన్నికలు పూర్తికాగానే గెలిచిన సంఘము నాయకులతో అధికారుల కమిటీ లో విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నారని గత ప్రభుత్వం ఆర్టీసీ నిర్వీర్యం చేయాలని చూసిందని తెలిపారు. పీఆర్సీ ప్రకటించి గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి ,విలీనం చేస్తుండడం పట్ల ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.విద్యార్థుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలల్లో మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచమని ,అనుభవం ఉన్న అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ మిల్క్ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు.ప్రయాణికులతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తుందని ఒక్కో మహిళ నెలకు 2-3 వేల రూపాయలు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 గ్యాస్ సబ్సిడీ , సన్న బియ్యం,నూతన రేషన్ కార్డులు పంపిణీ, ఉద్యోగ నియామకాలు రైతు భరోసా,రైతు రుణమాఫీ ఎలా ఎన్నో పథకాలు అమలు చేస్తూ దేశంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న పేదల ప్రభుత్వం అని తెలిపారు.అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం డిసెంబర్ 3 2023 న ప్రజల ఆశీర్వాదం తో అధికారంలోకి వస్తె 7 తారీఖు ప్రభుత్వం ఏర్పడగానే 48 గంటల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం.ఆర్టీసీ లో అప్పటి వరకు అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలు పరిష్కారం చేశాం. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా కొత్త బస్సులు కొనుగోలు చేశాం..కొత్త రూట్లలో బస్సులు నడిపిస్తున్నాం.మహిళలకు ఉచిత ప్రయాణమే కాక దేశంలోనే ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ నష్టాల నుండి ఆపరేషనల్ లాస్ నుండి లాభాల్లోకి వస్తుందిదేశంలోనే నెంబర్ వన్ ప్రజా రవాణా తెలంగాణ ఆర్టీసీ 10 వేలకు పైగా ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి, ప్రయాణికులతో మాట్లాడుతుంటే తాము రోజుకు ఉపాధి అవకాశాలు పొందుతూ ఛార్జీలు 200 వరకు ఆదా చేసుకుంటున్నామని తెలిపారు.మహిళల హాస్పిటల్‌కి దేవాలయాలకు ఉచితంగా వెళ్తున్నారు, ఆటో కార్మికు లు మా ఉద్యమకారులు.. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది,జూన్ 21 న నీట్ పరీక్ష రాసే వారికి ఉచిత ప్రయాణం అందించాలని అంబఅ అధ్యక్షుడు వెంకట్ స్వామి కోరారు .ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారికి హాల్ టికెట్ ఉన్నవారికి ఉచిత ప్రయాణం కల్పిస్తాం. ప్రజా పాలన ప్రభుత్వంలో విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కోసం ముందుకు వెళ్తుందనీ అన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావుకి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్..



**కరీంనగర్ జిల్లా, జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా రాజకీయాల్లో గతంలో వెంకట్ స్వామి, చొక్కారావు ఎలాంటి రాజకీయాలు చేశారో ఇప్పుడు నేను, శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అలాంటి రాజకీయాలు చేస్తున్నాం.రాజకీయాల్లో ఆదర్శంగా ఉన్నాం.. విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో ఉన్నాం.మేము పెరిగిన దానిపై మీ అందరూ ప్రత్యక్షం.సంక్షేమ శాఖల్లో మొత్తం సెంట్రల్ ప్రొక్యూర్ మెంట్ టెండర్లు 2000 కోట్లు కానప్పుడు 2 వేల కోట్ల స్కాం జరిగిందని ఎలా అంటారు.మీరు ఇలా మాట్లాడితే మీ గౌరవం మీ ఆలోచన విధానం ప్రజలకు తెలుస్తుంది.బలహీన వర్గాల మంత్రి గా నేను దళిత వర్గాల మంత్రి గా అడ్లూరి, మైనర్టి మంత్రి గా అవహేళన గా మాట్లాడడం పై ఆ సామాజిక వర్గాల పట్ల మీకు ఉన్న మేము పారదర్శకంగా ఉన్నాం.. మీరు నిరూపిస్తే మేము దేనికైనా సిద్ధం.అసత్య ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు 2002 లో సర్ జరిగినపుడు భారత ప్రజాస్వామ్యంలో ఎవరు ఓటు తొలగవద్దని భావించాం.ఇపుడు బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగించాలని సర్ తీసుకొచ్చారు, కాంగ్రెస్ ,బిఆర్ఎస్ సర్ పై ఇంత ఆందోళన చేస్తుంటే బీజేపీ ఎందుకు స్పందించలేదు.

# హజ్ పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న అజర్ దబీర్‌కు ఘన స్వాగతం..



**కరీంనగర్ టౌన్ జూన్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న అజర్ దబీర్ ను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, 61వ డివిజన్ కార్పొరేటర్ అతిఫ్ అతీనా, పట్టణ ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, 65వ డివిజన్ కార్పొరేటర్ మొహ్సిన్ మొహియుద్దీన్, 33వ డివిజన్ ఎఐఎంఐఎం నాయకుడు కజం అలీ ఖాన్, ఇస్తియాక్, అద్నాన్ అబ్బాస్ తదితరులు కలిసి అజర్ దబీర్ కు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. హజ్ యాత్రను పూర్తి చేసి క్షేమంగా తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, అల్లాహ్ తఆలా ఆయన హజ్‌ను అంగీకరించి, ఆరోగ్యం, సుఖశాంతులు, దీవెనలు మరియు విజయాలను ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని అజర్ దబీర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఉపసరించుకోవాలి

### ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

### ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం ముట్టడి.... ఉద్రిక్తత





**ఖమ్మం ప్రతినిధి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వ విధానాలను ఉపసంహరించుకోవాలని, ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని, విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యల పరిష్కారమే మార్గమని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విద్యార్థి సంఘాల నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ నాయకుల్ని టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఇటికల రామకృష్ణ మాట్లాడుతూ... ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుకు గురికావాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీ పెట్టి, ఫోటో దిగి, బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రారని రామకృష్ణ పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఏదైతే విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబించిందో ఈ ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యతిరేక విధానాల్ని అనుసరిస్తుందని విమర్శించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల విద్యా రంగానికి ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 26 వేల పైచిలుకు ఉన్నాయని, పాఠశాలలను కుదించి నాలుగువేల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. అధిక ఫీజులు, అర్హతలేని ఉపాధ్యాయుల బోధన, ప్రభుత్వ నిబంధనలనను సరించి వసతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ, ప్రజల సొమ్ముతో నెలవారి జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని, ద్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విద్యను సంతలో సరుకుగా మార్చేశాయనీ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఆయా మార్కెట్ కేంద్రాలుగా తలపిస్తు, పూర్తిగా వ్యాపార పరం చేస్తున్నాయని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అటువంటి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అడ్మిషన్స్ తీసుకుంటే బుక్స్ కు సపరేట్, యూనిఫామ్ సపరేట్ ఫీజులతో వసూళ్ల దందాకు తెరలేపాయని, విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు 25% ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్నా అమలకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాజానికి మేలుచేసే జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ, లకు లక్షల్లో ఫీజుల మోత మోగిస్తున్నాయన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, బుర్ర మనోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్, గోపి, రాము, గోపి, ఉమేష్, నరేందర్, సాయి, అభిరామ్, గోపి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ అప్రెంటీస్ షిప్ ట్రైనింగ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

**- యువతకు విస్తృత అవగాహన కల్పించాలి:జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ లో పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులు, సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ ద్వారా తెలంగాణలోని యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇంజనీరింగ్, డిప్లొమా, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అభ్యసించిన యువతకు పరిశ్రమలలో నైపుణ్య శిక్షణ అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం ద్వారా పరిశ్రమలు తమకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను సులభంగా ఎంపిక చేసుకోవచ్చని, శిక్షణ పొందుతున్న అప్రెంటిస్‌లకు ఇచ్చే స్టైఫండ్‌లో ప్రభుత్వ వాటా నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా అభ్యర్థుల ఖాతాలకు జమ చేయబడుతుందని తెలిపారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయిన తర్వాత సంస్థలకు నేరుగా పరిశ్రమ ప్రమాణాలకు తగ్గట్టుగా తయారైన ఉద్యోగులు లభిస్తారని కలెక్టర్ అన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్ ద్వారా సంస్థలు అప్రెంటిస్ ఖాళీలను ప్రకటించడం, దరఖాస్తులను పరిశీలించడం, కాంట్రాక్టులను సృష్టించడం వంటివి పూర్తిగా డిజిటల్ విధానంలో చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్ఎంఈ సంస్థలు అప్రెంటిస్‌లను నియమించుకోవడానికి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ అధికారిక పోర్టల్‌లో తమ సంస్థను నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

**- ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ వంద శాతం చేపట్టాలి**

**- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈ నెల 25 నుండి ప్రారంభం కానుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్ ల నియామకం చేయాలని, ఇంకనూ నియామకం చేయని రాజకీయ పార్టీలు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి, జాబితా సమర్పించాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులతో, బూత్ స్థాయి ఏజెంట్ లు ఇంటింటి ఎన్యుమరేషన్ లో పాల్గొనాలన్నారు. ఇంకనూ మ్యాపింగ్ కాని వారి నుండి 11 రకాల ధృవీకరణలో ఏది ఉన్న సేకరించి బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. 1987 కంటే ముందు పుట్టిన వారు స్వంతంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు స్వంతం తో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు స్వంతంతో పాటు తల్లిదండ్రులు, తల్లిదండ్రులు లేకపోతే తాత/నానమ్మ ల ధృవీకరణలు ఆధార్ తో పాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ లు జూన్ 25 నుండి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు కాపీలు నింపి, ఒకటి ఓటరుకు, ఒకటి బూత్ స్థాయి అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. మ్యాపింగ్ అయిన వారు ఎటువంటి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిన అవసరం లేదని, మ్యాపింగ్ కానివారు 11 రకాల ధృవీకరణలలో ఏదో ఒకటి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని, ఇందుకై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఏ. రాజు, డిటి అన్సారీ, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బి. శ్యామ్ సుందర్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు లింగనబోయిన సతీష్ బాబు, బి. జసవంత్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నరేందర్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, వై. రవి కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి చెరుకుపల్లి నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టిజి ఐపాస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పూర్తి చేయాలి



**- టిజి ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి-ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధికారులతో టిజి-ఐ-పాస్ కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్ అనుమతులు, టి - ప్రైడ్ పై పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల అనుమతులకు వేచియున్న ప్రతిపాదనల సమస్యలపై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో టీ - ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఎస్సీ, 13ఎస్టీ యూనిట్లకు ఒక కోటి 35 లక్షల 31 వేల 146 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. పావలా వడ్డీ క్రింద ఒక ఎస్టీ యూనిట్ కు 46 వేల 374 రూపాయల సబ్సిడీ అందించామన్నారు.

పరిశ్రమల శాఖ సంక్షేమ శాఖల సమన్వయంతో పథకాలు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమా వేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్టీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్‌కు సీపీఐ వినతి



**దేవనకొండ జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేవనకొండ మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ మండల ప్రతినిధి బృందం బుధవారం జిల్లా కలెక్టర్ డా. సిరికి వినతిపత్రం అందజేసింది. మండలానికి వచ్చిన కలెక్టర్‌ను కలిసిన సీపీఐ మండల కార్యదర్శి ఎం. నరసారావు నేతృత్వంలోని నాయకులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దేవనకొండలో డీఎన్‌టీఏ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని, మండలంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి సీసీ రహదారి నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ సమీపంలో సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, చెల్లెల చెలిమల, పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీరు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారంతో మండల ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సీపీఐ నాయకులు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఖండప్ప, సీపీఐ మండల నాయకులు రవి, భాస్కర్, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, హరి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

**● ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిది ● మండల టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి**



**వేంపల్లె జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని, ఓటు అనేది ఒక వజ్రాయుధం లాంటిదని మండల తెదేపా కన్వీనర్ సింగా రెడ్డి రామముని రెడ్డి అన్నారు. అంత విలువైన ఓటు హక్కును పరిరక్షించు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వేంపల్లిలో బుధవారం ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పక్రియ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాతపేట లో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి బిఎల్ఓ తమ పరిధి లోని ప్రతి ఓటరు పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అక్రమంగా ఓటర్లను చేర్చే ప్రయత్నాలు జరిగితే వెంటనే గుర్తించి అభ్యంతరాలు నమోదు చేయాలన్నారు. ఎస్ఐఆర్ పక్రియ పూర్తి అయ్యే వరకు బూత్ కమిటీ సభ్యులు ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచనలు చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హత కలిగిన ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బిఎల్ఓ లు రెడ్డిరాణి, గంగిరెడ్డి, బూత్ కమిటీ సభ్యులు, వేంపల్లి పట్టణ తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, టీడీపీ యూనిట్ సభ్యుడు జబిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను అభినందించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



**కర్నూలు జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** యోగాంధ్ర 2026 లో భాగంగా జిల్లా స్థాయి లో గెలుపొందిన క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ బుధవారం అభినందించారు. కర్నూలు జిల్లా నుండి 23 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా జేసీ వారిని అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో గెలుపొంది కర్నూలు జిల్లా పేరును నిలబెట్టాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం లో సీఈఓ సెట్కూరు డాక్టర్ వేణుగోపాల్, యోగాంధ్ర ఆయుష్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమర్నాథ్, యోగ అసోసియేషన్ అధ్యక్షులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

**● ఇద్దరు నిందితులు అదుపులోకి..11 తులాల బంగారం,కేటీఎం బైక్ స్వాధీనం**



**సిద్ధవటం జూన్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అంతరాష్ట్ర స్థాయిలో చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 11 తులాల బంగారం, కేటీఎం ద్విచక్ర వాహనం, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ రామనాథ్ హెగ్డే తెలిపారు. బుధవారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. భాకరాపేట వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అడ్డుకోవడంతో వారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఎస్సై హారిక, హెడ్ కానిస్టేబుల్ అంజీనాయక్, హోంగార్డు ప్రదీప్ కుమార్ వెంటాడి వారిని పట్టుకోగా, ఈ క్రమంలో ఇద్దరు పోలీసు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. విచారణలో నిందితులు సిద్ధవటం, ఒంటిమిట్ట, భాకరాపేట, బంగారుపాలెం ప్రాంతాలతో పాటు తమిళనాడులో నమోదైన పలు చైన్ స్నాచింగ్, దొంగతనాల కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు అంగీకరించినట్లు ఏఎస్పీ తెలిపారు. వృద్ధ మహిళలు, ఒంటరిగా ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేష్ బాలమురుగన్, ముత్తుపాండి ముత్తురామలింగంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేశ్వర్లు, హాజీ వలి, ఎస్సైలు హారిక, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫా ట్రైలర్ విడుదల




యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

------

# మా ఇంటి బంగారంలో సమంత పవర్‌ఫుల్ రోల్

టాలీవుడ్ నటి సమంప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ యాక్షన్ డ్రామా, రిలీజ్‌కు ముందే పెట్టిన పెట్టుబడిని పూర్తిగా రికవరీ చేసుకొని లాభాల బాట పట్టింది. ఈ విషయాన్ని 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై చిత్ర నిర్మాత హిమాంక్ దువ్వూరు అధికారికంగా ప్రకటించారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమాను రూ. 25 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మధ్య బడ్జెట్‌తో నిర్మించారు. అయితే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ (ఓటీటీ, శాటిలైట్) హక్కులకు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడటంతో, అన్ని డీల్స్ రిలీజ్ వారంలోనే విజయవంతంగా క్లోజ్ అయినట్లు తెలుస్తుంది. ఫలితంగా సినిమా విడుదలకు ముందే సేఫ్ జోన్‌లోకి వచ్చేసింది. ప్రస్తుత మార్కెట్‌లో ఒక మహిళా ప్రధాన తెలుగు చిత్రానికి ఇంతటి క్రేజ్ రావడం బలమైన కమర్షియల్ సిగ్నల్ అని చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా నిర్మాత హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ సినిమా స్క్రీన్‌పైకి రాకముందే పూర్తి పెట్టుబడిని రికవర్ చేయడం 'మా ఇంటి బంగారం'పై మార్కెట్‌కు ఉన్న నమ్మకానికి నిదర్శనం. సమంత పవర్‌ఫుల్ ప్రెజెన్స్, మా కథపై మేం పెట్టుకున్న నమ్మకం ఈ రోజు కమర్షియల్‌గా రిఫ్లెక్ట్ అవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దర్శకురాలు నందిని రెడ్డి మాట్లాడుతూ సమంతతో 'జబర్దస్త్', 'ఓ బేబీ' తర్వాత నాకు ఇది మూడో సినిమా. నాపై నమ్మకంతో తనే ఈ ప్రాజెక్ట్‌ను నా దగ్గరకు తీసుకువచ్చింది. జూన్ 19న థియేటర్లలో మీరు సమంతను పది రెట్లు ఎక్కువ పవర్‌ఫుల్‌గా చూస్తారు. ఇది నా ప్రామిస్ అంటూ చెప్పుకోచ్చింది. 2023లో వచ్చిన 'ఖుషి' చిత్రం తర్వాత సమంత పూర్తిస్థాయిలో వెండితెరపై కనిపించనున్న చిత్రమిదే. 2024లో వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌లో మెరిసిన ఆమె, 2025లో తన సొంత నిర్మాణంలో వచ్చిన 'శుభం' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించారు. మళ్లీ మూడేళ్ల తర్వాత థియేటర్లలో ఆమె నటిస్తున్న లీడ్ రోల్ మూవీ కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

ఇదిలావుంటే సమంత ప్రస్తుతం గర్భవతి అన్న వార్త ఇప్పుడు అభిమానుల్లో ఆనందం నింపుతోంది. అయితే దీనిపై అటువైపు నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

----------------






# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

### జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.

-------

# మరింత మెరుగ్గా సింగ్ గీతం గ్రాఫిక్స్




ప్రముఖ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాగ్ అశ్విన్ నిర్మించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' జూన్ 12న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా క్షి రిలీజ్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు నాగ్ అశ్విన్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.'ఈ సినిమా ఓటీటీ వెర్షన్.. థియేటర్ వెర్షన్ కంటే భిన్నంగా ఉంటుంది' అని నాగ్‌అశ్విన్ వెల్లడించారు. నిర్మాణదశ చివర్లో ఎదురైన సవాళ్ల గురించి ఆయన ప్రస్తావిస్తూ.. క్లైమాక్స్‌లోని కంప్యూటర్ గ్రాఫిక్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందని అనిపించింది. డిజిటల్ విడుదలకు ముందు, గ్రాఫిక్స్‌ని మరింత మెరుగు పరచడానికి మా బృందం యోచిస్తోంది. ఈ చిత్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు ప్రేక్షకులు డిజిటల్ వేదికగా ఆదరిస్తూనే ఉంటారు. అందుకే భవిష్యత్తు రోజులకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేయాలని భావించాం' అని పేర్కొన్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో మెరిశారు. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ప్లిక్స్‌కి విక్రయించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. అందువల్ల ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టొచ్చని తెలుస్తోంది.

----------------

# భారత్‌కు క్రిస్టోఫర్ నోలన్ రాక.. ముంబైలో 'ది ఒడిస్సీ' గ్రాండ్ ప్రీమియర్




ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు, ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు ఇది ఒక శుభవార్త. 'ఒపెన్‌హైమర్', 'ఇంటర్‌స్టెల్లార్', 'ఇన్‌సెప్షన్', 'ది డార్క్ నైట్' వంటి అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టనున్నారు. తన సరికొత్త చిత్రం 'ది ఒడిస్సీ' ప్రీమియర్ కోసం ఆయన జులైలో ముంబైకి రానున్నట్లు యూనివర్సల్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నోలన్‌తో పాటు ఆ చిత్రంలో నటించిన ఆస్కార్ విజేత మ్యాట్ డామన్, ప్రముఖ నటుడు టామ్ హాలండ్, ఆస్కార్ అవార్డు గ్రహీత, నిర్మాత ఎమ్మా థామస్ కూడా హాజరుకానున్నారు. క్రిస్టోఫర్ నోలన్ సినిమా ఒకటి భారతదేశంలో ప్రీమియర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జులై 17న థియేటర్లలోకి రానుంది. 'ది ఒడిస్సీ' గ్లోబల్ ప్రీమియర్ టూర్‌లో భాగంగా లండన్, పారిస్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాలతో పాటు ముంబైని కూడా అధికారికంగా ఎంపిక చేయడం భారతీయ మార్కెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. హోమర్ రచించిన ఇతిహాసం 'ఒడిస్సీ' ఆధారంగా ఈ చిత్రాన్ని నోలన్ తెరకెక్కించారు. ట్రాయ్ పతనం తర్వాత ఒడిస్సియస్ పదేళ్లపాటు తన ఇంటికి తిరిగి వెళ్లే ప్రయాణాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చూపించనున్నారు. ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. సరికొత్త ఐమ్యాక్స్ (×హీూశ) ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన మొట్టమొదటి ఫీచర్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. ముంబైలోని ఫీనిక్స్ పల్లాడియంలో ఉన్న పీవీఆర్ ఐకాన్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఈ ప్రీమియర్ వేడుక జరగనుంది. ఈ చిత్రంలో మ్యాట్ డామన్, టామ్ హాలండ్‌లతో పాటు ఆన్ హాత్వే, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, జెండాయా, చార్లీజ్ థెరాన్ వంటి భారీ తారాగణం నటించింది. నోలన్, ఎమ్మా థామస్ తమ సింకోపీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే భారతదేశంలోని పలు సినిమా థియేటర్లలో 'ది ఒడిస్సీ' ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అడ్వాన్స్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత గడ్డపై జరుగుతున్న అతిపెద్ద హాలీవుడ్ ఈవెంట్‌లలో ఒకటిగా ఈ ప్రీమియర్ నిలవనుంది.

# నవ్వుల వెనుక తీవ్ర వేదన..

### నటి సంచిత మృతిపై స్నేహితురాలి కీలక వ్యాఖ్యలు



ప్రముఖ టెలివిజన్ నటి, 22 ఏళ్ల సంచిత ఉగలే ఆత్మహత్య ఘటన బాలీవుడ్ టీవీ రంగాన్ని పెను విషాదంలో ముంచింది. జూన్ 14న నాలాసోపారా ఈస్ట్‌లోని తన నివాసంలో బెడ్‌రూమ్ సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆమె తనువు చాలించింది. అయితే, చనిపోవడానికి ముందు సంచిత ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభను ఆమె ఆప్తమిత్రురాలు, నటి గీతాంజలి, సంచిత కజిన్ ఆకాష్ సతీశ్ ఉగలే మీడియా ముందు బయటపెట్టారు.నటి గీతాంజలి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సంచిత గత జనవరి నుంచి తీవ్రమైన డిప్రెషన్ (మానసిక ఒత్తిడి), ఇన్సోమ్నియా (నిద్రలేమి సమస్య)తో పోరాడుతోందని వెల్లడించింది. "ఆమె గత కొన్ని నెలలుగా అస్సలు నిద్రపోవడం లేదు. మానసిక వేదన భరించలేక.. 'నాకు చనిపోవాలని ఉంది' అంటూ నాతో తరచూ అనేది" అని గీతాంజలి కన్నీరు పెట్టుకుంది. సంచిత తీవ్ర మానసిక స్థితిపై తన వద్ద కొన్ని వాట్సాప్ సందేశాల ఆధారాలు ఉన్నాయని, వాటిని కేవలం పోలీసుల విచారణలోనే అందజేస్తానని స్పష్టం చేసింది. అలాగే, సంచితకు ఎలాంటి వ్యక్తిగత ప్రేమ వ్యవహారాలు లేవని, దయచేసి పుకార్లను నమ్మవద్దని కోరింది.మరోవైపు సంచిత కజిన్ ఆకాష్ ఉగలే, ఆమె తండ్రి మచ్చింద్ర ఉగలే పరిశ్రమలోని కొందరు వ్యక్తులపై సంచలన ఆరోపణలు చేశారు. కాస్టింగ్ సర్క్యూట్‌కు చెందిన కొందరు ఏజెంట్లు సంచితను నిరంతరం మానసిక వేధింపులకు గురిచేశారని ఆకాష్ ఆరోపించారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఇండస్ట్రీలో రాణించాలని చూస్తున్న తన సోదరిని టార్గెట్ చేసి టార్చర్ పెట్టారని, అందుకే ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిందని వాపోయారు. జూన్ 14న నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణించిన రోజే సంచిత కూడా చనిపోవడం, ఆమె చివరి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లలో దీనికి సంబంధించిన కొన్ని సింబాలిక్ సూచనలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.